# మనిషి

ఎన్నాళ్ళనుంచో ఆవిషయం వాణ్ని అడిగి తెలుసుకోవా లనుకుంటూ ఉండేవాణ్ని. పెళ్ళి అయినప్పటినుంచీ, ప్రభా కరంలో ఏదో వింతమార్పు కనిపించింది. మరీ భార్య కాప రానికి వచ్చాక, ఏదో అసంతృప్తి మాత్రం వాడి ముఖంలో స్పష్టంగా కనిపించేది. సంసార జీవితంలో మొదట్లోనన్నా కనిపించే ఉత్సాహం వాడిలో ఎంత వెతకినా కనిపించక పోవటం నాకు ఆశ్చర్యకరమే అయింది.

నేను ఊహించ గలిగినన్ని కారణాల్ని ఊహించాను; వాడి పరిస్థితులన్నీ ఒకటికి పదిసార్లు పరామర్శచేసుకు చూశాను. కాని ఏ ప్రత్యేక కారణం వాణ్ని యీస్థితికి లాగు తోందో నాకు అంతు పట్టలేదు.

"ఎందుకూ ఎప్పుడూ దిగులుగా ఉంటావ్?" అన్నాను, ఒకనాడు. ఇక ఊహించి లాభం లేదనీ, వాణ్ణే అడిగి తెలుసు కోవటం కన్న వేరు మార్గం లేదనీ నిశ్చయించుకొన్నాను.

"ఏమీ లేదు..—" అని తప్పించుకోవాలని చూశాడు.

నేను అంతలో వదలక "సరిగ్గా చెప్పు. ప్రతి జీవితానికీ ఏదో వొకలోటు ఉండనే ఉంటుంది. కాని, కొన్ని సమస్యల్నీ లోపాల్నీ సర్దుకునే అవకాశం కూడా ఉంటుంది. నీకు నువ్వే ఏదో బాధగా ఉండటం నన్నుకూడా ఒక విధంగా బాధిస్తూనే ఉంది." అన్నాను.

వాడు ఏదో అనుమానంగా నాకళ్లల్లోకి చూసి, తరువాత నిశ్శబ్దంగా ఆకాశం వైపు చూడ సాగాడు.

"నాదగ్గర దాచాల్సినంత పెద్దకారణమా ?" అన్నాను.

"ఊహుఁ." అన్నాడు, వినపడీ వినపడనట్టుగా.

"ఇంక చెప్పరాదూ ? ఏదన్నా ముందుందేమో ఏతకేం దుకు నేనూ సహాయపడతానుగా ?" అని ధైర్యం చెప్పాను.

కాస్త ఆగి మళ్ళీ "కానీ... చెప్పు—" అని హెచ్చరిం చాక, చెప్పేది తను కాదన్నట్టు వేరొక దిక్కు చూస్తూ, "ఏంలేదు. నాభార్య విషయం—" అని ఆగాడు.

ఏం ? వాడి భార్యకేం ? అందమైనదే ! పెద్దింటినుంచి వచ్చిందికూడా. నలుగురితోనూ భుజాలుకలిపి తిరగగలిగే చాకచక్యం ఆమెలో లేకపోయినా, ఎవర్నీ నొప్పించకుండా తన పనేదో చూసుకుపోగల మనిషి. ఆమె అణకువ చూస్తే ఉత్తమ ఇల్లాళ్ళలిస్టులో జమవెయ్యాక తప్పదు. విశేషించి ఆమె మాకు దూరపు బంధువుకూడాను. నేను విన్నంత వరకూ, నాకు తెలిసినంతవరకూ ఆమె చాలా మంచిది. ఇంక వీడు చెప్పేదేమిటి ?

"నీభార్యకేం?" అన్నాను, మామూలు ధోరణిలోనే.

వాడికి కాస్త ధైర్యం వచ్చిందనుకుంటాను; గొంతు సవ రించుకొని "అదేం ఖర్మమో కాని ఆపెళ్ళయిన నాటినుంచీ నాకు చెడ్డరోజులేరా !" అన్నాడు.

"అంటే?" అన్నాను, అర్థమవక.

"పెళ్ళయిన సంవత్సరమే—ఎన్నడూ తప్పి ఎరగని నాకు బి.యే. పరీక్ష పోయింది..." ఆగి, నాముఖంలోకి చూశాడు, సరిగ్గా ఆమాటల్ని జీర్ణించుకున్నానో లేదో నన్నట్టు.

నవ్వాలో ఏడవాలో నాకు తెలియలేదు. వెంటనే పట్ట

రాని కోపం వచ్చినా, సామ్యవాదం చేసి వాణ్ణి ఒప్పించాలనే పట్టుదలవల్ల, ఏభావాన్నీ వ్యక్తీకరించలేదు.

"ఐతే, పరీక్ష పోవటం ఆమె తప్పేనంటావా?" అన్నాను.

"అనను... మొదట్లో నేనూ అట్లాగే సరిపెట్టుకున్నాను"

"మరి?"

"చెప్తే నమ్ముతావో లేదో కాని... ఆనాటినుంచే కుటుంబానికి అరిష్టం చుట్టుకుంది. ఐదు సంవత్సరాలనుంచీ కోర్టుల చుట్టూ తిరుగుతూ, అంతులేకుండా డబ్బు ఖర్చు పెడుతూ, తప్పకుండా గెలుస్తామనుకుంటూన్న దావా కాస్తా పోయి పాతిక వేల ఆస్తికాస్తా క్షవరమైపోలా?"

"అందుకు ఆమె బాధ్యత ఏముంది?"

"లేకపోవచ్చు. కాని కొన్ని జాతకాలుంటయ్యే—మనిషి బతుకును అధోగతికిలాగేస్తయ్. భార్యజాతకం భర్తను అనువర్తించటాన్ని ఏనాడో పెద్దలేరాసిపెట్టారు. మొదట్లో నేనూ వీటిని నమ్మేవాణ్ణికాదు......కాని జీవితంలో ఇంతగా బాధపడుతూ, ఇన్ని దృష్టాంతరాలు కనిపిస్తూంటే ఇంకా ఎల్లా నమ్మకుండా ఉండగలను?"

"ఇంకా?" అన్నాను, వాడిధోరణిని ప్రోత్సహిస్తూ.

"ఆమె కాపరానికి వచ్చి ఇంట్లో కాలుపెట్టింది... నాయనా, ఎన్ని అవస్థలు పడాలో అన్నీ పడుతున్నాం. రావాల్సిన బాకీలురావు; ఇవ్వాల్సినవి ఆగవు... ఎంత పలుకుబడితో ఉద్యోగానికి ప్రయత్నం చేసినా నిష్ప్రయోజనమౌతోంది—"

ఇంక లేనా జీవితంలో అపజయాలు? తన ప్రయత్నాలూ, తన తప్పులూ, తన అదృష్టమూ ఎందుకు వీడు ఇతర్లమీాదికి

తోస్తాడు? ఇంక ఆపకపోతే వీడి ధోరణికూడా ఆగేటట్టు లేదు.

"పెళ్ళినాడు ఐదువేలకట్నం తీసుకురాగలిగినప్పుడు ఆమె అదృష్టవంతురాలేగా?" అన్నాను.

"కాదురా—" అన్నాడు.

"పోనీ, నీ దురదృష్టమే ఆమె అదృష్టాన్ని పాడు చేసిందని ఎందు కనుకోవు?"

"ఎట్లా? ఇదివరకు నాపరిస్థితులన్నీ ఆమె రాకతో తారుమారయినయ్... నీకు అర్థమవదు. పొద్దున్నే లేచి ఆమె ముఖం చూస్తే చాలు—ఆనాడు విధిగా అవ్వాల్సిన పనులు కూడా ఎదురుతిరుగుతయ్—"

"నీ నమ్మకం అపాయపు పొలిమేరలు దాటుతోంది—"

నేను నవ్వటం మొదలు పెట్టాను. వాడికి కోపంకూడా వచ్చిందనుకుంటాను.

"పై వాళ్ళకు నవ్వులాటగానే ఉంటుంది. నాకు తెలుసు—యీ కారణాల్ని ఎవ్వరూ నమ్మరని; పైపెచ్చు నన్ను ఎగతాళి చేస్తారనికూడా ఎరుగుదును. అందుకనే ప్రాణస్నేహితుడివైనా ఇన్నాళ్ళూ నీకు చెప్పకుండా దాచాను. తీరా చెప్పాక- ఎందుకూ ఆనవ్వు?"

వాడి కోపానికి నానవ్వు భయపడ్డది.

"నువ్వు నాస్థితిలో వుంటే అర్థమయ్యేది" అన్నాడు.

ఇంక వాడితో యీవిషయాన్ని వాదించటంకన్న, మానుకోవటమే అప్పటికి మంచిదిగా కనిపించింది. ఇంతవరకూ జరిగిన సంభాషణను మరిచిపోయినట్టుగానే నటిస్తూ, ప్రస్తావనను

మార్చి, ఆ సాయంత్రానికి విడిపోయ్యాము.

కాని ప్రభాకరాన్ని చూసి జాలిపడ్డాను. ఎంత ఆలోచించినా ఆ జాలిని ఎల్లా వెల్లడించాలో నాకు అర్థమవలేదు. వాడు చెప్పిన విషయాలన్నీ నెమరువేసుకున్నాను. వీళ్ల అదృష్టాదృష్టాల్ని భరించేందుకు భార్యల బాధ్యతకూడా వుందనే విషయం కొత్తగా కనిపించింది. వాడు ఇంకా ఎన్ని విధాలుగా నాకు రుజూచేసినా, అజాతకం బాపతు కీలకం యేమిటో నాకు అర్థమవదు. వాడు నమ్మిన యీవిషయాన్ని నేను నమ్మనూలేను. పూర్వాచారాలమీద వాడు చేసిన తీవ్ర విమర్శ, జ్యోతిషంమీద వాడుచూపే అపనమ్మకమూ, పిచ్చిపిచ్చి సిద్ధాంతాలమీదా, ఆచారాలమీదా, వాడు కనపరిచే అగౌరవమూ—అన్నీ ఏమయ్యైనై? పైకి ఏవిధంగానూ కనిపించకుండానే, ప్రభాకరం ఇంత మార్పుతో యీనాడు నాకు కనిపించటం ఆశ్చర్యమే అయింది.

వాడి నమ్మకాన్ని పోగొట్టగలిగేశక్తి నాలో లేదు. "నీకు అనుభవం లేదు" అనే వాదనను తీసుకొచ్చాడంటే నేను ఓడిపోతాను. ఇంకేవిధంగానూ వాణ్ని ఒప్పించటంకూడా అసంభవం. ఇంకోరకం సమస్యయితే ఫరవాలేదు కాని, కేవలం నమ్మకం మీద ఆధారపడ్డదాన్ని పోగొట్టటం మాటలా? అయినా యీ సమస్యతో నేనెందుకు బాధపడాలి?

ఆ సంబంధాన్ని ఎంత వదులుకుందామన్నా, ఎందుకోగాని మనస్సు అటువైపే లాగుతుంది. ఆ దంపతులు నాకు కావలసిన వాళ్లవటమూ, వారు సౌఖ్యపడటమే నేను కోరేదవ

టమూ ఇందుకు కారణాలై ఉంటయ్యేమో ?

తరువాత లోపాయికారీగా కనుక్కుంటే— వీడు ఇంట్లో కూడా ఆమెను సరిగ్గా చూడడట ! చీటికీ మాటికీ ఆమె అంటే కసురుకుంటాడట. ఇంట్లోని మిగతా వాళ్ళుకూడా ఇదే ధోరణట! ఆమెమాత్రం అన్నింటినీ భరిస్తూ ఊరుకుంటుందట !

ఇది మరీ వింతగా తోచింది. అందరూ నమ్మితే ఆమె గతేంకాను ? జీవితాంతం వరకూ కలిసి మెలిసి ఉండాల్సిన భార్యాభర్తల్లోనే యీ విభేదం వస్తే—ఇంక ఆ కాపరం సంగతి అడగనా ?

ఎంత చెప్పినా ప్రభాకరం వినేరకం మనిషి కాదని నాకు తెలుసు. ఐనా, ఇంటి విషయాల్లో మధ్య నేనెల్లా కల్పించుకొని యీ ఉరితాటిని మెడలో వేసుకొని, ముందు మా మిత్రత్వానికే స్వస్తి చెప్పుకోను ?

ఎంత ప్రయత్నించినా అది, మరపురాని విషయమైంది. ఇంత దుర్బలహృదయంతో తన బతుకు నంతట్నీ అదృష్టం మీద మోపి—ఆ బరువును ఒక్క వ్యక్తి భుజాలమీద మోపటంలో వీడి అభిప్రాయ మేమిటి ? ఏదో పిచ్చి కోపం వచ్చింది—కాని ఏం చెయ్యను ? ఎట్లా రుజూచెయ్యను ? కాలులో విరిగిన ముల్లులాగు కలుక్కులుక్కునే యీరకం విషయాన్ని ఎల్లా మరిచిపోను ?

## 2

ఒక సంవత్సరం గడిచింది; కాని ప్రభాకరం యేమీ మారి నట్టు కనిపించదు. రోజురోజుకూ వాడి ఆందోళన ఎక్కువౌ

తోంది.

ఒక మధ్యాహ్నం నాదగ్గరకు వచ్చాడు వాడి ముఖం మీదినవ్వు చూసేప్పటికే ఏదో మంచివార్త వచ్చిం దని గ్రహించాను.

"చూశావా—ఆమెను కానుపుకు పంపాను; ఇటు సర్వీస్ కమీషన్ పరీక్షలో పాసయ్యాను. ఇదివరకు నువ్వు నమ్మ లేదు..." అని ఆకాగితాల్ని నాముందు పడేశాడు.

నే నేమీ మాట్లాడలేదు. మరొక వారానికల్లా వాడు ఉద్యోగంలోకి వెళ్ళిపోయాడు. ఈసిదర్శనాన్ని ఆధారంచేసు కొని, వీడికోసమని ఒక్కసారిగా నే నెల్లామారను?

మరొకనెల గడిచాక—అనుకోకుండా ఒక సాయంత్రం మళ్ళీ నాదగ్గరకు వచ్చాడు. వాడి ముఖంలో ఏభావమూ స్పష్టంగా లేదు.

"ఏమిటి విశేషం?" అన్నాను.

"మా ఆవిడ పోయింది" అన్నాడు.

"ఆఁ" అన్నాను ఆశ్చర్యపడుతూ.

ఆమెమృత్యువు వాణ్ని ఆందోళనపరచలేదు. చావసిద్ధమైన ముసలివాళ్లు పోతే కలిగే బాధకన్న ఎక్కువ బాధకు వాడు గురవలేదు. ఇష్టం లేని వ్యక్తి పోవటంవల్లనే వాడు లెక్కచెయ్యలేదేమో ?

"ఆమె పోయినందుకు నే నంత విచారించను... కాని..."

నేను వింటూ ఊరుకున్నాను.

"పాపిష్టిది ఊరకనే పోయిందీ? ఒక కొడుకునుకూడా నామెడకుచుట్టి మరీపోయింది."

అదా వీడి విచారం? బతికి ఉండి ఆమె వీడికి చేసిన హాని కన్న, చచ్చి చేసిన హానే ఎక్కువన్నమాట!

"నువ్వా విషయాన్ని గూర్చి బాధపడటం దేనికి?"

"వాణ్ని ఎట్లా పెంచను?"

"రెండో పెళ్ళి చేసుకో—" అని సలహా ఇచ్చాను.

"ఈ సత్రకాయ ఒకడుండె......పిల్లనిచ్చేవాడు దొరకొద్దూ?"

ఎవ రెట్లాపోయినా, మానవుడు స్వసౌఖ్యంకోసం పడే తిప్పల్ని, పాపం విప్పిచెప్పాడు. ఆమె వీడిపెళ్ళికే ఆటంకాన్ని సమకూర్చిపోయింది. ఏమైనా నాదృష్టిలో, ఆమె యీ దురదృష్టానికి బాధ్యురాలవటంకన్న, పోవటంవల్లనే అదృష్టవంతురాలైంది.

"తరువాత ఆలోచించుకోవచ్చులే—" అన్నాను.

"అదే..." అని ఊరుకున్నాడు.

మరొక నెల గడిచాక ఇంకో చిత్రం జరిగింది. హఠాత్తుగా ప్రభాకరం మళ్ళీ నాదగ్గరకు వచ్చాడు, ఏదో తాజావార్తను తెచ్చిన విలేఖరిలాగు.

"ఏమిటి?" అన్నాను, వాడి ముఖంలోని తొందరను చూసి.

"మా బావమరిది పోయ్యాడు—" అన్నాడు, కనిపించీ కనిపించని నవ్వుతో.

నేను ఆశ్చర్యపోయ్యాను. పాపం, వాళ్ళకుటుంబానికి మిగిలిన ఒకడూకూడా పోయ్యాడన్నమాట!

ఇక వీడిముఖం ఎందుకు తేటగావుందోకూడా నేను

ఊహించగలను. మామగారిది నలభై వేల రూపాయిల ఆస్తి వీడికి రాబోతోంది.

"సరే...మంచి అదృష్టవంతుడివే" అన్నాను.

వాడు ఒప్పుకున్నట్టు తల ఊపాడు. నాకు ఇంకో అనుమానం కూడా తీరలేదు.

"ఇంతకూ నీభార్య అదృష్టవంతురాలేనా?" అన్నాను.

ఈమాటతో వాడు సిగ్గుపడతాడనుకున్నాను. కాని మామూలు ధోరణిలోనే, "ఆమె దేముందిరా? అటు పుట్టింటికి కానుపుకని వెళ్ళిందో లేదో, వాళ్లకు అరిష్టం వచ్చె—" అన్నాడు.

ఇంకేం — ఆమె చచ్చికూడా వీడిదృష్టిలో నష్టజాతకురాలే! వీడి నమ్మకంకూడా యీ జన్మలో తీరదు.

"సరే...నీ రెండో పెళ్ళిమాటేమిటి? ఈమధ్య ఎక్కడో సంబంధంకూడా కుదిరిందటే?" అన్నాను.

"కుదిరింది... కాని ఎట్లా చేసుకోను?"

"ఏం?"

"ఆ స్తంతా కుర్రాడికేగా? నేను ఇంకోపెళ్ళి చేసుకొని ఆ స్తితో ఎట్లా సంబంధం పెట్టుకోను? కుర్రాణ్ని కనిపెట్టి వుంటే మంచిఛాన్సు వుంటుంది గాని—"

నాకు ఒళ్లు మండి, "అంతేలే...నువ్విప్పుడు పెళ్ళిచేసుకుంటే ఆ వచ్చే భార్య నిజంగా దురదృష్టాన్ని నీకోసం తీసుకొచ్చి, మీాఇంట్లో దింపుతుంది." అన్నాను.

వాడు తెల్లముఖం వేసి, గట్టిగా ఊపిరిపీల్చాడు.

— ఏప్రిల్, 1942.

లక్ష్మీ పవర్ ప్రెస్, తెనాలి.